వాడు ధైర్యశాలి, మంచి నేర్పరి, అతనిదగ్గర మంచి పిస్తోళ్ళున్నవి. అర్థమైందా?' అని మళ్ళీ ఆమె పెద్దగా నవ్వుతుంటే నా ఒళ్లు జలదరించింది.

"పిల్లేను. గార్జియాను నేను ద్వేషిస్తున్నాను, కాని అతను నా సహచరుడు. ఏదో ఒకరోజు బహుశా అతని పీడ నీకు వదిలిస్తాను. కాని ఆ వ్యవహారం మా యిద్దరిమధ్యా మా దేశపద్ధతిలో తేల్చుకుంటాం. నేను యాదృచ్ఛికంగా జిప్సీనై నానుగాని, కొన్ని విషయాల్లో నేను అచ్ఛమైన నెవాగ్రో జాతివాడిగానే వుంటాను" అన్నాను.

"దానికామె 'నీవు ఒట్టి తెలివితక్కువవాడివి; మూఢుడివి, అసలైన పెయిల్లోవి. చాలాదూరం వుమ్మెయ్యగలను గనుక తాను చాలా పొడుగు వాడనని అనుకున్న మరుగుజ్జులాంటి వాడివి. నీకు నేనంటే ప్రేమలేదు. వెళ్ళిపో!" అన్నది.

(అనువాదం: కె. యస్. శివరావు)

(వచ్చేసంచికలో ముగింపు)

స్కెచ్

# చిలుక జోస్యం

విశ్వమిత్ర

త్రికగా రోడ్డున నడుస్తున్న మంగయ్యని పంజరంలోవున్న చిలుక ఆకర్షించింది. ఏమీ తోచకా, అసలు ఏమిటి వస్తుందో అనీ, మంగయ్య ఓ అణా పంజరం కెదురుగా వున్న కార్డుమీద వేశాడు. అది చూసిన చిలుక బైటికొచ్చి తమాషాగా ముక్కుతో ఓ కార్డు లాగింది. ఆ కార్డుని మంగయ్యకి చదివి వినిపించాడు ఆ చిలుక యజమాని. ఏమిరేమిటో చదివి ఆఖరికి 'నీ మరణానికి నీరు కారణమౌతుంది' అని చదివాడు, అది విని వులిక్కిపడ్డాడు మంగయ్య. తనకా నీటిగండం!

మంగయ్య నడుస్తున్నాడన్న మాటేగానీ మనసు మనసులోలేదు. ఏడాదిక్రితం జరిగిన ఓ సంఘటన జ్ఞాపకం వొచ్చింది.

ఆ రోజున—మంగయ్య ఏదో తాడు పేనుకుంటున్నాడు. అకస్మాత్తుగా ఏవో కేకలూ, జనం పరిగెత్తటం చూసి పేనుతూ వున్న తాడుని అలాగే వొదిలేసి రోడ్డువెంబడి, జనం పరిగెత్తేవైపున పరిగెత్తాడు. అలా చెరువు గట్టుమీద జనం గుంపులుగా కనపడేవరకూ పరుగు ఆపనేలేదు. జనం మధ్యలో తలదూర్చి చెరువువైపు చూసేటప్పటికి చెరువు మధ్యలో నీళ్ళమీద తేల్తూ పొడుగాటి జుట్టుమాత్రం కనపడింది. ఆ చెరువు లోతు తెలిసిన, ఆవూరి గజీతగాళ్లెవరూ సాహసించలేక పోతున్నారు.

తర్వాత రెండుమూడు నిముషాలకి, చెరువు మధ్యలో తలెత్తిన మంగయ్యని చూసి జనమంతా "హుషార్ మంగయ్యా హుషార్" అని అరిచిన అరుపులు మంగయ్య జన్మలో మరిచిపోలేడు.

జనమంతా బ్రహ్మరథం పట్టారు. కాని ఒడ్డుకు చేరేదాకా మంగయ్యకే నమ్మకంలేని, ఆ రోజు సంఘటన తలుచుకొంటే మంగయ్య కిప్పటికీ కాళ్ళల్లో ఒణుకు పుడుతుంది.

అటువంటి సాహసంచేసిన తనకేనా నీటిగండం! మంగయ్యకి నవ్వొచ్చింది. జాతకాలమీద నమ్మకంలేదు మంగయ్యకి కానీ... కానీ...ఏదో మూలనుంచీ భయం పట్టుకుని పీడిస్తూవుంది.

తన చిన్నప్పుడు మొట్టమొదట ఈత నేర్చుకొనేటప్పుడు చెరువు వొడ్డుని అందుకోబోయి కాలుజారి చెరువులో పడ్డాడు. అప్పుడు అదృష్టవశాత్తు అందిన కొండరాయి అంది వుండకపోతే తన నీటిగండం నిజమయ్యేదే! ఏమో! అలాటి ప్రమాదం ఏమైనా వుందేమో ముందు ముందు, ఏమైనా ఇహముందు కాస్త జాగ్రత్తగా మసులుకోవటం ఎందుకైనా మంచిదే.

"కాస్త జాగ్రత్తగావుంటే సరి! ఇహ దీన్ని గురించి ఆలోచించుకోవటం అనవసరం!" అని అనుకొన్న మంగయ్యకి ఇంటికెళ్ళి అన్నంతిని నుక్కి మంచంమీద వాలగానే మళ్ళీ ఆలోచన్లు కందిరీగల్లా లేచినయ్.

తన చిన్నప్పు డెప్పుడో విన్నట్టు గుర్తు. కొందరు గజీతగాళ్ళు సముద్రంలో చేపలు పట్టటానికి వెళ్ళి వలల్లోపడ్డ చేపల్ని లాగలేక నీళ్లల్లో పడి చచ్చిపోయినట్టు. ఇది తలుచుకోగానే మంగయ్యకి ఆశ్చర్యమేసి నవ్వొచ్చింది. 'వొట్టి చవట వెధవలు!' అనుకొన్నాడు కానీ మళ్ళీ మరుక్షణం 'తన నీటిగండం' గుర్తుకు రాగానే "ఏమోలే!" అనిపించింది.

తను ఆ సాయంత్రం కాలక్షేపానికి బజారు కెళ్ళటం వెళ్ళినవాడు వెళ్ళినట్టు తిరిగిరాక, ఇదొకటి అనవసరంగా తెలుసుకోవటం మంగయ్య మనసుని ఎంతో బాధ పెట్టింది. అది వాడు చెప్పగానే వాడి గొంతూ, వాడి చిలుకగొంతూ అక్కడి కక్కడే నులిమి పారేయాలనిపించింది మంగయ్యకి. కానీ తన మేలుకోరి, తనని జాగ్రత్తగా వుండమని, తనకి రాబోయే కీడునిగురించి హెచ్చరించిన ఆఏమీ తెలియని చిలుకా, కేవలం ప్రజాశ్రేయస్సుకే జీవితాన్ని ధారపోసే ఆ చిలుక యజమానికి క్షమించక తప్పలేదు మంగయ్యకి.

ఆ రాత్రి పీడకలలు మంగయ్యని నిద్రపోనియ్యలేదు. పోనీ అలాగే మేలుకొని కూచుందామా అంటే ఏవో వెర్రిమొర్రి ఆలోచనలు.

సముద్రం మధ్యలో పడవ తలక్రిందులైపోయి నిస్సహాయంగా ఈతకొడుతున్నట్టూ, అలా ఈత కొట్టికొట్టి ఎంతోసేపటికి వొడ్డు చేరుకొన్నట్టు, దాహంవేసి, అలిసిపోయి మూర్ఛపోయినట్టూ, పీడకలలు.

మంగయ్యకి ఒళ్ళంతా చెమటపోసింది. కాళ్లూ చేతులూ ఆళ్ళేదు, నిజంగానే అంతఇంతా తను అప్పటికప్పుడు కొట్టినట్టే అనిపించింది. పైగా దాహంకూడా విపరీతంగా వేసింది. పదినిముషాలు ప్రయత్నించి ఆఖరికి మంచంలోంచి లేచి, కూజా మంచినీళ్ళు తాగితర్వాత కాస్త తేలికనిపించింది. అంతదాకా గుండెలమీద ఏదో బరువున్నట్టే అనిపించింది మంగయ్యకి.

తర్వాత మూడు నెలలూ మంగయ్యజీవితంలో ముఖ్యమైన మార్పును తీసికొచ్చినయ్. జీవితంలో దేనికీ జడివని మంగయ్య నీళ్ళని విషమల్లే చూసేవాడు.

ఓనాడు సాయంత్రం షికారుగా అలా చెరువు గట్టుమీదకి వెళ్ళాడు. ఎరిగున్నవాళ్ళతో చాలాసేపు ఏవేవో మాట్లాడుతూ అక్కడే కూర్చున్నాడు. చెరువులో చిన్నపిల్లలు ఈతలుకొడుతున్నారు. వాళ్ళనిచూసి మంగయ్యకి ఏవేవో ఆలోచన్లు వచ్చినయ్. కాని వాటిని పెరగనియ్యలేదు మంగయ్య. తర్వాత కాసేపటికి ఆ పిల్లల్లోంచి ఏవో అరుపులు వినబడ్డంతో అక్కడేవున్న మంగయ్య ఇంకా కొందరూ అటుచూశారు. అప్పటికే చాలా నీళ్ళు తాగిన కుర్రాడు నీళ్ళలోకి మునుగుతున్నాడు. అందరూ కేకలు పెట్టేవాళ్ళే. ఎవరూ ఏమీచెయ్యలేకపోతున్నారు. మంగయ్య చెరువులోకి దూకేద్దామనుకొన్నాడు. ఒక్కక్షణం మంగయ్య ఏదో ఆలోచించాడు. కాళ్లు గజగజా వొణికాయ్. అంతే...అడుగు ముందుకివెళ్ళేదు. జనం హడావుడిపడుతున్నారు. మంగయ్యా! మంగయ్యా ఊహూఁ, మంగయ్య మాట్లాడలేదు. ఐదునిముషాల్లో కుర్రాడు కనపడకుండాపోయాడు. మంగయ్య అక్కడనుంచోలేకపోయాడు. గబగబా ఇంటిముహంపట్టాడు. సుమారు సంవత్సరంక్రితం చెరువుమధ్యలోకి ఈదుకొంటూ వెళ్ళి ఆ ఆడదాన్ని మోసుకొచ్చింది తనేనా? అనిపించింది కానీ ఈనాడు తను చెరువులోకి అడుగు పెడితే మళ్ళీ ప్రాణాల్తో బైటికి రావటం వట్టిది అనిపించింది మంగయ్యకి. చివరికి ఆ కుర్రాడికి "నీటిగండం!" వుంది. అందుకనే నీళ్ళలో మునిగి చచ్చిపోయాడు అని సమాధానం చెప్పుకుని వూరుకున్నాడు. కానీ మనసు మంగయ్యని ఎగతాళి చేసింది. నీగతి అంతేగా! కాచ్చు! అలాగని యివ్వాళ ఎవరికోసమో తన ప్రాణాన్ని వొదులుకోవడం తెలివైన పనిగా తోచలేదు, మంగయ్యకి. రోజూ ప్రపంచంలో ఎంతమంది చావటం లేదు. వీళ్లందరికోసం తను చావగలడా? ఎలాగో మనసుని సమాధాన పరుచుకొన్నాడు మంగయ్య.

మంగయ్యలో త్యాగం నశించింది ఈ విషయం ఎలాస్పష్టంగా తెలుసుకోలేక పోయినా తనలో మార్పొచ్చినదిమాత్రం గ్రహించగలిగాడు మంగయ్య. కానీ కారణం తన స్వంత ప్రాణం రక్షించుకోటానికి ప్రయత్నంగానే

లెక్కగట్టి దాన్ని గురించి ఆదేపనిగా ఆలోచించి బాధపడ దలచుకోలేదు మంగయ్య.

తర్వాత ఇలాటివి రెండుమూడు జరిగినయ్ గాని మంగయ్యేమీ వాటిలో సంబంధం కల్పించుకోలేదు. నిజానికి మంగయ్య మనసులో చాలా బాధపడేవాడు. తను తలుచుకొంటే చాలామంది చచ్చిపోకుండా చెయ్యగలిగేవాడేగానీ వొచ్చిన చిక్కల్లా ఇది తన ప్రాణానికి సంబంధించిన విషయమవటమే!

ఓసారి మంగయ్య ఏదోపనిమీద దూర ప్రయాణం చేయాల్సొచ్చింది. అది నడివేసవికాలం. పైగా దోవంతా ఎడారిలా వుంటుంది. కాని తప్పదు. ఒకే బిగువున నడవాలి. అందుకేమీ సందేహించలేదు మంగయ్య. అన్నం, రొట్టెలూ మూటకట్టుకొని తాబేటికాయలో నీళ్లునింపుకొని బైల్దేరాడు.

మొదటిరోజునడక సాఫీగానే సాగిపోయింది. రెండోరోజుకూడా బైల్దేరాడు. కొంతదూరం నడిచాక తను తెచ్చుకున్న రొట్టెలూ అన్నీ తిని మంచినీళ్లు తాగాడు. రొట్టెలు అయిపోయేటప్పటికి ఇంకో రెండుమూడు కోసులు నడవాల్సింది వుంది. ఫరవాలేదనే ధీమాతోనే బైల్దేరాడు మంగయ్య. తాబేటికాయలో నీళ్లుకూడా కొద్దిగానే వున్నయ్. కానీ ఎండెక్కినకొద్దీ కొంచెం కష్టమనే అనిపించింది. దాహం విపరీతంగా వెయ్యటంవల్ల వున్న కాసినినీళ్లూ ఖాళీ చేశాడు మంగయ్య. కాస్త ఎక్కడైనా కూర్చుందామన్నా ఒక్కచెట్టయినా కనపళ్ళేదు. దూరాన ఏవోచెట్లూ, నీళ్ళూ వున్నట్టుగా వుంటే తన దోవ కాకపోయినా, కాసేపు కూర్చుందామని అటు వెళ్ళాడు, కానీ ఎంతదూరం పోయినా అలాగే అనిపించింది. నీళ్లుకూడా ఐపోవటంతో మంగయ్యకి నడక మరీ కష్టమనిపించింది.

ఇంకొంచెం దూరం పోయాక ఇహ అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. ఇసుకలో అడుగు తీసి అడుగు వెయ్యటం బ్రహ్మప్రళయం అయింది. పైనతలా, కిందకాళ్ళూ ఎండకి మాడిపోతున్నయ్. సాలి గూట్లో చిక్కుకున్న ఈగలా అయ్యాడు మంగయ్య. సాలీడల్లే సూర్యుడు తన పదునైన కిరణాలతో పొడుస్తున్నాడు. ఇహ నడవలేక అక్కడే కాసేపు కూర్చుందామని కూలబడ్డాడు. దాహం వేస్తోంది. నీళ్లులేవు కోపంవచ్చి తాబేటికాయని నేలకేసి కొట్టాడు. ముక్కలు ముక్కలయింది. నాలుక పిడచగట్టుకు పోతోంది... పెద్దగాలి వీచింది. దాంతో ఇసుక మంగయ్య కంటే రెట్టింపు ఎత్తు లేచింది. కళ్లు మూసుకుపోయాయి దూరాన ఎక్కడో ఓచిన్న మేఘం తనవైపు వస్తోంది. ఆశగా అటు చూశాడు మంగయ్య. కానీ కొద్దిసేపట్లోనే అది తన మీదుగానే దాటిపోయింది. నిస్సహాయంగా ఇసకలో పడుకొని మంగయ్య పిడచకట్టుకుపోయిన తన నాలికని చాచి, దాటిపోయే మేఘం వంక జాలిగా చూశాడు.

మంగయ్యకి ఇంకా ఆలోచించే శక్తిపోలేదు. కాని తను ఇహ బతకడని తెలుసు. అకస్మాత్తుగా మంగయ్యకి తన ప్రాణగండం జ్ఞాపకం వచ్చింది. మంగయ్య మొహంలో చిన్ననవ్వు వెలిసింది! చాలా కాలం క్రితం "నీ మరణానికి నీరు కారణమౌతుంది" అనే ఆ చిలుక జ్యోతిషం జ్ఞాపకం చేసుకుంటూ మంగయ్య కొన్ని నిమిషాల క్రితం తను నేలకేసి కొట్టిన తాబేటికాయవంక వింతగా చూశాడు. ఆరోజు రాత్రే సముద్రంలో పడవ తలకిందులై, కష్టపడి ఈతకొట్టి దాహంతో తను వొడ్డుకు చేరి మూర్ఛపోయినపీడకల కూడా గుర్తుకు వచ్చింది. ఆనాడు తను చూస్తుండగా చెరువులో ఈత చేతకాక కాళ్లుచేతులూ గిజగిజ తన్నుకుని చచ్చిపోయిన కుర్రాడు, మంగయ్య మనసులో మెదిలాడు.

నీళ్ళకోసం ఆకాశంవైపు నోరు తెరిచి, మళ్లీ ఆ నోటిని ముయ్యనేలేదు మంగయ్య...

---

'సర్వమంగళగుణ సంపూర్ణ' అయిన ఆదర్శ స్త్రీ దొరికితే తప్ప పెళ్ళి చేసుకోనని భీష్మించుకుని కూర్చున్నవాడికి దేవుడే దిక్కు. తీరా అటువంటి యువతిని పెళ్ళాడిన తరవాత దేవుడుకూడా అతణ్ణి రక్షించలేడు. —(బెన్ టిల్లెట్)